31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

మంగళవారం, ఆగస్టు 4, 2026 పేజీలు : 8

## దూరదృష్టి కలిగిన నాయకుడు కేసీఆర్

- కేసీఆర్ వల్లే వరద కాలువలోకి జలాలు : కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 3 :** మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ఫలితంగానే నేడు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్ ద్వారా వరద కాలువలోకి గోదావరి జలాలు చేరుతున్నాయని సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. గత రెండు రోజులుగా ఎల్లంపల్లి నుంచి రాజేశ్వర రావుపేట పంప్‌హౌస్ ద్వారా సుమారు అర టీఎంసీ నీటిని వరద కాలువలోకి విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నీటితో -మిగతా 2లో

# ఉపాధి కల్పించే అభివృద్ధి, పెట్టుబడులే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ఉద్యోగమే లక్ష్యంగా యువత వచ్చే మూడు నెలలు క్రమశిక్షణతో సిద్ధం కావాలి
- పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీరు, మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుంది
- ప్రభుత్వం--పరిశ్రమలు కలిసి పనిచేస్తే సమాజానికి మరింత మేలు జరుగుతుంది
- బొక్కలవాగు అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి
- స్థానిక యువతకు ఉపాధి కల్పించే పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం
- మంథనిలో విస్తృతంగా పర్యటించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు





**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (మంథని), ఆగస్టు 3 :** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించే అభివృద్ధి కార్యక్రమాలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా శివకిరణ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ‘మన ఊరు--మన కోచింగ్ సెంటర్’లో ఉచిత కానిస్టేబుల్, ఎస్సై కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్-ఎల్‌బీ గార్డెన్‌లో టీ వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి ఉచిత హెల్మెట్లను పంపిణీ చేశారు. మంథని క్యాంపు కార్యాలయంలో హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి పరిశ్రమల అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమం ‘ప్రాజెక్ట్ షైన్’ కింద చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యామ్ అప్‌గ్రేడేషన్, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో నూతన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. రత్నాపూర్ గ్రామంలో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు.

**ఉద్యోగం సాధించే వరకు అండగా ఉంటుంది....**

‘మన ఊరు--మన కోచింగ్ సెంటర్’ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, ప్రస్తుతం మరో 7 వేలకుపైగా పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత పూర్తిగా వినియోగించుకోవాలని, రాబోయే మూడు నెలలు జీవితాన్ని మార్చే కాలంగా భావించి స్పష్టమైన లక్ష్యంతో సిద్ధం కావాలని సూచించారు. కోచింగ్ సెంటర్‌లో అత్యుత్తమ శిక్షణతో పాటు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్, వసతి, భోజన సౌకర్యాలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ కనీసం 15 గంటలు క్రమశిక్షణతో చదివి ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం వరకు -మిగతా 2లో



## విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

- ప్రతి పాఠ్యాంశంపై పట్టు సాధించాలి
- విరామ సమయంలో ఆటలు ఆడాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల అర్బన్ రెసిడెన్షియల్ విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ

**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, ఆగస్టు 03 :** విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని అర్బన్ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్ రూమ్ లో బియ్యం, పప్పులు, గుడ్లు ఇతర నిలువ పదార్థాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడాడు. మెనూ ప్రకా రం నాణ్యమైన భోజనం భోజనం పెడు తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. సైన్స్ పాఠ్యాంశానికి సంబంధించిన పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లా డుతూ.. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తు న్న సదుపాయాలను -మిగతా 2లో

### ప్రజావాణి ఫిర్యాదులను

## సత్వరమే పరిష్కరించాలి




**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 3:** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, -మిగతా 2లో



## టిసిఎస్ఎస్ అధ్యక్షులుగా నల్ల భాస్కర్




**చురకలు విలేకరి, కొడిమ్యాల, ఆగస్టు 3 :** తెలంగాణ కల్చరల్ సొసైటీ 13వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆగస్టు 2న లిటిల్ ఇండియాలోని కుర్తాళం బోర్డర్‌లో జరుగగా,ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొడిమ్యాలకు చెందిన నల్ల భాస్కర్ గుప్త, ప్రధాన కార్యదర్శిగా బొందుగుల రాము, కోశాధికారిగా శశిధర్ రెడ్డి ఎర్రమరెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులుగా మరో 20 మందిని ఎంపిక చేశారు.నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## నిలబడితే చేతులకు అందే ఎత్తులో విద్యుత్ లూజ్ లైన్

**-ఆందోళన చెందుతున్న రైతు**
**-పట్టించుకోని అధికారులు**



**చురకలు ప్రతినిధి**
**ఎల్లారెడ్డిపేట ఆగస్టు 03 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జంబుల్లా ఏరియాలో నిలబడితే చేతులకు అందే ఎత్తులో విద్యుత్ లూజు లైన్ ఉంది.దీంతో ప్రమాదం పొంచి ఉంది తన పొలం పైన ఉన్న లూజు విద్యుత్తులైన్‌ను సరిచేయాలని గత కొంతకాలంగా విద్యుత్ అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్న పట్టించుకునే నాధుడే లేడని రైతు కటకం బాలయ్య ఆందోళన వ్యక్తం చేశారు.వరి నాట్లు వేసే సమయంలో పొలం దున్నేటప్పుడు విద్యుత్ లూజు లైన్ దున్నే ట్రాక్టర్లకు వరి కోసే సమయంలో వరి కోత యంత్రాలకు విద్యుత్ లూజ్ లైన్ తగిలి విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఇలా పలుసార్లు ఇబ్బందుల పాలయ్యామని కర్రలతో విద్యుత్తు లైనును పైకెత్తి వ్యవసాయ పనులను చేసుకుంటున్నామన్నారు ఇప్పటికైనా ఎన్ పిడిసిఎల్ విద్యుత్ అధికారులు రైతు ఇబ్బందులను గుర్తించి "చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టే చందంగా " కాకుండా ముందు జాగ్రత్త చర్యగా విద్యుత్తు లైను సరి చేయాల్సిన బాధ్యత అవసరం ఎంతైనా ఉందని రైతులు అంటున్నారు.

## దూరదృష్టి కలిగిన నాయకుడు కేసీఆర్

**మొదటి పేజీ తరువాయి....** ఇప్పటివరకు బీడుగా ఉన్న వేలాది ఎకరాల భూములు సాగుకు అనుకూలంగా మారి సస్యశ్యామలంగా మారనున్నాయని అన్నారు. తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీరు అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారని ఎమ్మెల్యే తెలిపారు. ఒకప్పుడు గోదావరి జలాలు సముద్రంలో కలిసిపోతుండగా వాటిని సద్వినియోగం చేసేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త దిశ చూపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నేడు వరద కాలువలోకి నీరు చేరడం ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు ఎంత దూరదృష్టితో నిర్మించబడిందో మరోసారి స్పష్టమైందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రంలోని చెరువులు రిజర్వాయర్లు కాలువలు నీటితో కళకళలాడుతూ రైతులు రెండు మూడు పంటలు పండించే పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జగిత్యాల కోరుట్ల మెట్పల్లి ప్రాంతాలతో పాటు వరద కాలువ ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని భూగర్భ జలాలు పెరిగి రైతులకు గ్రామీణ ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే అన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు తెలంగాణ వ్యవసాయ రంగాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపాయని కాళేశ్వరం వంటి మహత్తర ప్రాజెక్టుల ఫలితాలు రానున్న తరాలకు కూడా ఉపయోగపడతాయని ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు.

# ఉపాధి కల్పించే అభివృద్ధి, పెట్టుబడులే ప్రభుత్వ లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...** తన బాధ్యత అని, ఉద్యోగం సాధించడం మాత్రం వారి సంకల్పం, కష్టపడే తత్వంపైనే ఆధారపడి ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. తాను దారి చూపగలనని, కానీ విజయాన్ని అందుకునేది వారి కృషి ద్వారానేనని అన్నారు. వచ్చే మూడు నెలలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, మంచి ఆలోచనలతో, క్రమశిక్షణతో చదివి ఉద్యోగం సాధిస్తే వారి కుటుంబాల్లో ఆనందం నింపినట్లవుతుందని, అదే తనకు నిజమైన సంతృప్తి అని తెలిపారు.

**పరిశ్రమలకు ప్రభుత్వం పూర్తి సహకారం**

మంథని క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ ప్రతినిధులు, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీరు, రహదారులు, ఇతర మౌలిక వసతులు అన్నింటినీ ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రానికి మరిన్ని నాణ్యమైన పెట్టుబడులు రావడం, స్థానిక యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**బొక్కలవాగు అభివృద్ధితో నీటి సంరక్షణ....**

**ప్రజలకు మెరుగైన వాతావరణం**

హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థ తమ సీఎస్ఆర్ కార్యక్రమం లి'ప్రాజెక్ట్ షైన్'లి కింద చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యామ్ అప్‌గ్రేడేషన్, సుందరీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బొక్కలవాగు వద్ద గార్డెనింగ్, ఓపెన్ జిమ్ అప్‌గ్రేడేషన్, వాకింగ్ ట్రాక్, చిన్నారుల కోసం పార్కు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా బొక్కలవాగులో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు డీ-సిల్టింగ్ పనులు కూడా చేపడుతున్నామని చెప్పారు.బొక్కలవాగు బండ్ అభివృద్ధి పనులకు గతంలో 2011-12లో అనుమతులు లభించాయని, ప్రస్తుతం వాటిని ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. ఈ అభివృద్ధి పనులను సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టాలని హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థను కోరగా, సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించి రూ.2 కోట్ల నిధులు అందించారని మంత్రి పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా నీటి సంరక్షణ మెరుగుపడటంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి పనిచేస్తే సమాజానికి మరింత మేలు చేయగలమని పేర్కొంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టిన హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థను అభినందించారు. తెలంగాణ వ్యాప్తంగా మరిన్ని పరిశ్రమలు కూడా ఇలాంటి సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.బొక్కలవాగు సుందరీకరణ, గార్డెనింగ్, డీ-సిల్టింగ్, వాకింగ్ ట్రాక్, జిమ్, చిన్నారుల పార్కు తదితర అభివృద్ధి పనులను అత్యున్నత నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ వైద్య సేవల బలోపేతానికి చర్యలు**

అనంతరం మంథని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో నిర్వహించిన నూతన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని ప్రభుత్వ వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు స్థల పరిశీలన**

పర్యటనలో భాగంగా రత్నాపూర్ గ్రామంలో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, సంబంధిత శాఖల అధికారులు, కంపెనీ ప్రతినిధులతో కలిసి మంత్రి పరిశీలించారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేసి స్థానిక యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**మంథని అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

మంత్రి మాట్లాడుతూ మంథని పట్టణంలో రోడ్ల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పలు మౌలిక వసతుల పనులను ప్రభుత్వం ప్రాధాన్యతతో చేపడుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో సురేష్ , మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, సయేందర్ రెడ్డి,తహసిల్దార్ ఆరిఫ్ ఉద్దీన్ ,ప్రజాప్రతినిధులు, హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ ప్రతినిధులు, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**మొదటి పేజీ తరువాయి.....** అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 60 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బ్రహ్మ కుమారీస్ వారి ఆధ్వర్యంలో నాషా విముక్తి భారత్ కార్యక్రమం లో భాగంగా 10 కోట్ల మంది వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. జిల్లా సంక్షేమ శాఖ వారి తల్లిపాల వారోత్సవాల పోస్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ వారి తెలంగాణ జలసిరి పోస్టర్ లను ఆవిష్కరణ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బి. ఎస్. లత, బి. రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి



**మొదటి పేజీ తరువాయి.....**
సద్వినియోగం చేసుకోవాలని, చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతి సబ్జెక్టులోని అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రణాళిక ప్రకారం చదివితే భవిష్యత్తు లో ఎంతో మేలు చేస్తుందని వివరించారు. విరామ సమయంలో విద్యార్థులు ఆటలు ఆడాలని సూచించారు.

## పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అభినందించిన ఎస్పీ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 3:** జగిత్యాల జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్ని కైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, జాయింట్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ట్రెజరర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సభ్యులను ఎస్పీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అనేది కేవలం ఒక సంఘం మాత్రమే కాకుండా, పోలీసు అధికారుల సంక్షేమం, పరస్పర సహకారం, వృత్తిపరమైన అభివృద్ధి, సేవా నిబద్ధతను మరింత బలోపేతం చేసే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. పోలీస్ సిబ్బంది, అధికారులు ఎదుర్కొనే సమస్యలను బాధ్యతాయుతంగా గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. జిల్లా పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే విధంగా అసోసియేషన్ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తామనితెలిపారు. జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షుడు జీవన్ రాజ్ (కానిస్టేబుల్), ఉపాధ్యక్షులు ఆరిఫ్ అలీ ఖాన్ (ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్), శ్రీకాంత్ (ఎస్.ఐ.), కార్యదర్శి కిరణ్ కుమార్ (రిజర్వ్ ఇన్స్పెక్టర్), జాయింట్ సెక్రటరీ కేశవేని సత్యనారాయణ (కానిస్టేబుల్), ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. మల్లేశం (కానిస్టేబుల్), (ట్రెజరర్) మాటి రమేష్ (కానిస్టేబుల్), యూనిట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అనుగుల మహేష్ (కానిస్టేబుల్) ఎ. రాజేశ్వర్ (కానిస్టేబుల్), కొలగాని జలపతి (కానిస్టేబుల్), డి. సౌందర్య (హెడ్ కానిస్టేబుల్), కొలుగాని మల్లేశం (కానిస్టేబుల్), గోశెట్టి విద్యానాథ్ (కానిస్టేబుల్)లు ఎన్నికయ్యారు.

## నర్సింగ్ అధికారికి సన్మానం



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (03) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చిలుక అనిత కమలాకర్ నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాన్ని సాధించి ప్రస్తుతం హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆమెను మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, మాజీ సర్పంచ్ నేరెళ్ల హేమలత శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామానికి చెందిన యువతీ యువకులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సాధ్యమేనని పేర్కొన్నారు. అనిత కమలాకర్ సాధించిన విజయాన్ని ఆదర్శంగా తీసుకుని మరింత మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్లు మంజూరు కాలేదు..

**-దివ్యాంగుడికి కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ భరోసా**



**చురకలు ప్రతినిధి కోరుట్ల ఆగస్టు 03 :** జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సమస్య పరిష్కారం కోసం కోరుట్ల నియోజకవర్గానికి చెందిన ఓ దివ్యాంగుడు కలెక్టరేట్‌కు రావడంతో కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ అతనితో మాట్లాడారు. ఈ సందర్భంగా కొత్త దివ్యాంగుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఇంత దూరం ఎందుకు వచ్చావని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు కాలేదని ఆయన అన్నారు. ఇలాంటి సమస్యల కోసం కలెక్టరేట్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, నేరుగా తనను ఫోన్‌లో సంప్రదిస్తే తానే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని దివ్యాంగుడికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందనతో దివ్యాంగుడు ఆనందం వ్యక్తం చేయగా, అక్కడ ఉన్న పలువురు ప్రజలు ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ స్పందనను అభినందించారు.

## అంగన్వాడిలో తల్లిపాల వారోత్సవాలు



**చురకలు విలేకరి,జగిత్యాల, ఆగస్టు 3 :** జగిత్యాల రూరల్ మండలం కన్నపూర్ గ్రామ అంగన్వాడి కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పొట్టవత్తిని సతీష్ మాట్లాడుతూ పుట్టిన శిశువుకు తల్లిపాలే సంపూర్ణ పోషకాహారమని,ప్రతితల్లి తొలి 6నెలల పాటు బిడ్డకు కేవలం తల్లిపాలనే అందించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి,శిశువు ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారుల సంరక్షణ, పరిశుభ్రత, సమతుల్య ఆహారం, గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తల్లులు, చిన్నారులకు పోషకాహార సూచనలు అందించి,గుడ్లు,ఇతర పోషకాహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చైతన్య,అంగన్వాడి టీచర్ రాజేశ్వరి,ఆశా వర్కర్, గ్రామ సిబ్బంది, గర్భిణీ స్త్రీలు, బాలింతలు,చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# చెరుకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

**-రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (03) :** చెరుకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం ఇబ్రహింపట్నం మండల కేంద్రం లో సమావేశం నిర్వహించగా రైతులు వినతిపత్రం సమర్పించారు. మల్లాపూర్ మండలం ముత్యంపేటలో ఉన్న నిజాం చక్కెర కర్మాగారం గత ప్రభుత్వం హయాంలో మూతపడటంతో చెరకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. చక్కెర కర్మాగారం మూతపడటంతో తమ చెరుకును కామారెడ్డి జిల్లా లోని ప్రైవేట్ చక్కెర కర్మాగారాలకు తరలించాల్సి వస్తోందని,దీనివల్ల టన్నుకు సుమారు రుపాయలు 400 వరకు అదనపు రవాణా భారం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మూతపడిన నిజాం చక్కెర కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంద న్నారు. చెరకు రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నంధయ్య ,పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# నాలుగు గ్రామాల్లో గ్రామసభలు

**- జలసిరి,జీపీడీపీ, ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (03) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని బర్దిపూర్, ములరాంపూర్, కేశాపూర్, కోజన్ కోత్తూర్ గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీఓ సీహెచ్ గణేష్, వ్యవసాయ అధికారి ఆకు రాజ్‌కుమార్, ఎంపీఓ రామకృష్ణ రాజు పాల్గొని జలసిరి, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఘన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త, ప్రత్యేక జాగ్రత్త చెత్త కోసం నాలుగు రకాల చెత్త డబ్బాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు చెత్తను వేర్వేరుగా వర్గీకరించి సంబంధిత డబ్బాల్లో వేయాలని సూచించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో ఫార్మ్ పాండ్ నిర్మించుకోవాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్థులకు వివరించారు. వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి చేరేలా చర్యలు తీసుకోవడం ద్వారా నీటి సంరక్షణ సాధ్యమవు తుందని తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి గ్రామసభ ద్వారా ఆమోదించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సంఘం అమృత,కానుగంటి లాస్యశ్రీ, భోనగిరి స్వాతి,చల్ల రక్షిత,పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తాగునీటి బావి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



**చురకలు విలేకరి,జగిత్యాల, ఆగస్టు 3 :** జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామంలో ఉన్న తాగునీటి బావి అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం గ్రామ సర్పంచ్ పొట్టవత్తిని సతీష్ జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మంచినీటి బావికి చుట్టూ సిమెంట్ గాజులు లేకపో వడంతో వర్షాకాలంలో వరద నీరు బావిలోకి చేరి తాగునీరు కలుషిత మవుతోందని పేర్కొన్నారు. దీంతో గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని, బావిలో పేరుకుపోయిన పూడికను తొలగించడం,బావి చుట్టూ సిమెంట్ గాజులు నిర్మించడం,అవసరమైన రక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు ఈ పనులను అత్యవసరంగా చేపట్టాలని,సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేసి సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ను సర్పంచ్ పొట్టవత్తిని సతీష్ కోరారు.

## గ్రామభివృధిలో ప్రతిఒక్కరు భాగస్వామ్యులు కావాలి



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, ఆగస్టు 3 :** గ్రామభివృధిలో ప్రతిఒక్కరు భాగస్వామ్యులై ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోని, జలసిరి విధానంలో భాగంగా నీరు వృధా కాకుండా కుంటాలను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీఓ మహేందర్ సూచించారు. మండలంలోని రంగారావు పేట గ్రామంలో సోమవారం సర్పంచ్ గుర్రం బాలరాజ్ అధ్యక్షతన జరిగిన గ్రామసభ కార్యక్రమలో ముఖ్య అతిథిగా ఎంపీడీవో ఉటుకూరి మహేందర్ పాల్గొన్నారు. ఈ మేరకు జలసిరి కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించే ఇందిరమ్మ ఇండ్లకు ఇంకుడు గుంతలు ఏర్పార్చాలని రైతులు పంట కుంటలు, నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల వర్షాల వల్ల వచ్చే నీరు వృధా కాకుండా కుంటలో ఉండటం వల్ల పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. బోర్వెల్ రీచార్జ్ పిట్స్, ఇండ్లలో చెత్తను నాలుగు రకాల ఘన వ్యర్థాలుగా వేరు చేసి వేయాలని దానివల్ల కాలాగే లాభలను గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెద్ద రాజన్న, వార్డు సభ్యులు స్వప్న, సుధవేణి రాజు, సతీష్, వెంకటేష్, కార్యదర్శి విజయ్ కుమార్, అంగన్వాడీ టీచర్ సుమలత, అనురాధ, ఆశావర్కర్ మమత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాత్రికేయున్ని పరామర్శించిన మాజీ మంత్రి



**చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 3 :** రాయికల్ పట్టణానికి చెందిన పాత్రికేయుడు చింతకుంట సాయికుమార్ కు మోచేయి శస్త్ర చికిత్స జరగగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి సోమవారం పరామర్శించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.వీరి వెంట మున్సిపల్ చేర్మెన్ రవీందర్,యువజన నాయకుడు తాటిపర్తి సి కె రెడ్డి,నాయకులు బర్కం మల్లేష్,కొయ్యేడి మహిపాల్ రెడ్డి,అనిల్,తురగ శ్రీధర్ రెడ్డి,నాగరాజు,బొమ్మకంటి నవీన్,శ్రీకాంత్,సాయి కుమార్,మోబిన్,రవి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (03) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ గ్రామంలో సోమవారం అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఎన్ఎం రామగిరి సుప్రియ తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు అందించే ప్రయోజనాల గురించి వివరించారు. పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తల్లి మరియు బిడ్డ ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. మొదటి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ అనురాధ,పంచాయతీ కార్యదర్శి నవీన్, వార్డు సభ్యులు సురేష్,సతీష్,ఆశా కార్యకర్త రాధ,ఆయా జమున పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయవద్దు

**-జగిత్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు నందయ్య**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగష్టు (03) :** కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో నిర్వహి స్తున్న ఎస్ ఐ ఆర్ ప్రకియ కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులు నిర్లక్ష్యం చెయ్యవద్దని కోరుట్ల నియోజకవర్గం లో అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా గల్లంతు కాకుండా చూడాలని అన్నారు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నంధయ్య అన్నారు.సోమవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో సర్ కార్యక్రమంపై కార్యకర్తలు, నాయకులలతో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు తో నిర్వహించారు.ఎస్ ఐ ఆర్ పక్రియ గ్రామలలో వంద శాతం పుర్తి చేయటం కోసం బిఎల్ ఓ లకు కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ లను నందయ్య, జువ్వా డి కృష్ణారావు లు శాలువలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోరిగాం రాజు ,వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డి, సర్పంచ్ లు, వార్డ్ సభ్యులు ,కాంగ్రెస్ పార్టీ, మహిళా కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే

**-కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్**




**చురకలు ప్రతినిధి కోరుట్ల ఆగస్టు 03 :** జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్‌ను కలిసి పలు ప్రజా సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కోరుట్ల పట్టణంలోని గడి బురుజు భూమిపై విధించిన వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (విఎల్‌టి)ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మొదటి వినతిపత్రాన్ని సమర్పించారు. గడి బురుజు భూమి కోరుట్ల పట్టణానికి చారిత్రక ప్రజా ప్రాధాన్యం కలిగిన ఆస్తి అని దానిని ప్రజా ప్రయోజనాల కోసం పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ నేపథ్యంలో గడి బురుజు భూమిపై విధించిన వీఎల్‌టిని వెంటనే రద్దు చేసి ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి ప్రజాభిప్రాయానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ మరో వినతిపత్రాన్ని అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యాసంస్థలు ఫీజుల చెల్లింపుపై ఒత్తిడి తెస్తూ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.విద్యార్థుల విద్యాభవిష్యత్తు దెబ్బతినకుండా ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు సమస్యలపై జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# డిఏపి ఎరువులు బ్లాకులో విక్రయాలు

**-వ్యవసాయ అధికారుల ముందే జీరో వ్యాపారం. ఒక్కో సంచి పై రూ.500లు అదనం వసూలు**

**-ప్రశ్నిస్తున్న రైతులకు డిఏపీ లేదని పంపిస్తున్నా వైనం**



**చురకలు విలేకరి, గొల్లపల్లి, ఆగస్టు 3 :** గొల్లపల్లిలో డీఏపీ ఎరువుల బ్యాగులను బ్లాక్ చేసి డీలర్లు అందరూ కుమ్మక్కై అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గొల్లపల్లి మండలంలో సుమారు 15 వరకు ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయి. అన్ని షాపుల్లో డి ఎ పి ఎరువులు అందుబాటులో ఉన్న అదనపు ధర చెల్లించిన వారికే డి ఏ పి బ్యాగులను అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కో బస్తాకు రూ.1350 లు ఎమ్మార్పీ ప్రకటించింది. కానీ గొల్లపల్లిలో ఒక్కో బ్యాగు పై రూ.500 రూపాయలు అదనంగా తీసుకుంటూ యదేచ్ఛగా రూ. 1850 రూపాయలకు డి ఏ పి బ్యాగులను విక్రయిస్తున్నారు. ఈ తథాగమంతా వ్యవసాయ అధికారుల ముందే జరుగుతున్న వారు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది. వరి పొలాలు వేస్తున్న సమయంలో ప్రతి రైతుకు డీఏపీ ఎరువుల బ్యాగులో అవసరం ఉంటుంది. దాన్ని అలుసుగా చేసుకొని ఫర్టిలైజర్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ధర ఎక్కువ చేసే అమ్ముతున్నారని అడిగిన రైతులకు మా షాపులో డీఏపీ బ్యాగులు లేవని తెగేసి చెబుతున్నారు. వ్యాపారులు అడిగిన కాడికి ధర చెల్లిస్తేనే డీఏపీ బ్యాగులను అందిస్తున్నారు. జిల్లా కలెక్టర్, అధికారులు స్పందించి రైతులకు ఎంఆర్పి ధరలకే డిఏపి విక్రయించేలా చర్యలు తీసుకో వాలని, అధిక ధరలకు విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు.

# మణుగూరు పీవీకే ఓసీ డీప్ సైడ్ బ్లాక్ సింగరేణికే కేటాయింపు

**కార్మిక శ్రేణుల విజయోత్సవం : కోట రవీందర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 3 :** సింగరేణి సంస్థ మనుగడకు , వేలాది మంది కార్మికుల ఉద్యోగ భద్రతకు అత్యంత కీలకమైన మణుగూరు పీవీకే ఓసీ డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను ప్రైవేట్ వాణిజ్య వేలంపాట పరిధి నుండి పూర్తిగా తొలగించి, నేరుగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (సింగరేణి) సంస్థకే కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవడం పట్ల RG-3 ఏరియా కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టీయూసీ ) తీవ్ర హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు యూనియన్ ముఖ్య నాయకులు కోట రవీందర్ రెడ్డి గారు ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు 180 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు కలిగి ఉండి, ఏడాదికి 6 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల ఈ భారీ బ్లాక్ ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లకుండా సింగరేణి దగ్గరే ఉండడం వల్ల యావత్ సింగరేణి ప్రాంతానికి, ముఖ్యంగా మణుగూరు ఏరియా సామాజిక, ఆర్థిక వృద్ధికి మరియు కార్మికుల భవిష్యత్తుకు బలమైన భరోసా లభించిందని ఆయన పేర్కొన్నారు.ఈ చారిత్రాత్మక విజయం వెనుక ఐఎన్టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. జనక్ ప్రసాద్ సమర్థవంతమైన నాయకత్వం, సమయస్ఫూర్తి ఉన్నాయని కోట రవీందర్ రెడ్డి కొనియాడారు. జనక్ ప్రసాద్ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ని స్వయంగా కలిసి ఈ బ్లాక్ యొక్క ప్రాముఖ్యతను మరియు సింగరేణికి దీని అవసరాన్ని తగిన ఆధారాలతో వివరించడం వల్లే కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని గుర్తుచేశారు. ఈ నిర్ణయం సాధన కోసం ఆగస్టు 1వ తేదీన ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఉధృతంగా చేపట్టిన భారీ నిరసన ప్రదర్శనలు, సంఘటిత పోరాటాలే కేంద్రంపై ఒత్తిడి తెచ్చాయని, గతంలో 'తాడిచేర్ల-2' బొగ్గు బ్లాక్‌ను సాధించుకున్న వ్యూహాత్మక అనుభవం కూడా ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి ఎంతగానో ఉపయోగపడిందని ఆయన వివరించారు.ఈ అద్భుతమైన మైలురాయిని సాధించేందుకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, చొరవ చూపిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారికి, ముందుండి నడిపించిన డాక్టర్ బి.జనక్ ప్రసాద్ గారికి మరియు యాజమాన్య ఒత్తిళ్లను సైతం లెక్కచేయకుండా ఉద్యమంలో పాల్గొని విజయం ఖాయం చేసిన ప్రతి ఒక్క సింగరేణి బొగ్గు గని కార్మికుడికి కోట రవీందర్ రెడ్డ ఆర్జీ3 ఏరియా ఐఎన్టీయూసీ తరపున విప్లవాత్మక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేశారు. సింగరేణి సంస్థను పరిరక్షించుకోవడానికి, కార్మికుల న్యాయమైన హక్కుల కోసం మరియు వారి సంక్షేమం కోసం ఐఎన్టీయూసీ ఎల్లప్పుడూ అగ్రభాగాన నిలిచి తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.



# అంగన్వాడి టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ ఆగస్టు 4 :** హుజూరాబాద్ ఐ సి డి ఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 16 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు సిడిపిఓ ఎం.సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు.సోమవారం ఆమె విలేకరులతోమాట్లాడుతూ..అంగన్వాడి టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు.ఈనెల15 సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తులు ఆన్లైన్లో మాత్రమే స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హత ఉన్న మహిళలు మాత్రమే పోస్టులకు అర్హులని,అభ్యర్థి సంబంధిత అంగన్వాడి కేంద్రం పరిధిలోని గ్రామపంచాయతీలో ,హుజూరాబాద్ మున్సిపాలిటీలో అయితే సంబంధిత వార్డులో స్థానికురాలు అయి ఉండాలని తెలిపారు.01.07.2026 నాటికి 18నుండి35 సంవత్సరాలు లోపు మహిళలు అర్హులని,ఖాళీల వివరాలు,ఎంపిక ప్రక్రియ,రిజర్వేషన్ తదితర వివరాలకోసం వెబ్ సైట్‌ను సందర్శించాలని,వెబ్సైట్ ద్వారానే దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. సైదాపూర్ మండలంలో సైదాపూర్-1 ఓసి, సైదాపూర్-2 ఎస్సీ (గ్రూప్-11), గొడిశాల-1(ఓసి), గొడిశాల-2 (ఎస్సీ గ్రూప్-11),దుద్దెనపల్లి-1(ఎస్సీ గ్రూప్-111), సర్వాయిపేట (ఎస్సీ గ్రూప్-111), వీణవంక మండలంలో రెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తపల్లి(వి హెచ్), జమ్మికుంట మండలంలో.. గండ్రపల్లి(ఎస్సీ), నాగంపేట (ఎస్ టి), వెంకటేశ్వర్లపల్లి పంచాయతీ పరిధిలోని గోవిందాపూర్ (ఎస్సీ గ్రూప్ -11), బిజిగిరి షరీఫ్ పరిధిలోని మొల్లపల్లి(బీసీ ఈ), గండ్రపల్లి పరిధిలోని ఒడ్డెర వాడ(బిసి ఎ), ఇల్లందకుంట మండలంలో గడ్డివానిపల్లి(బీసీ సీ), హుజురాబాద్ మండలంలో శాలపల్లి ఈ డబ్ల్యూ ఎస్, రాంపూర్ పరిధిలోని గొల్లపల్లి బిసి-డి, హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని కుమ్మరివాడ (3వ వార్డ్) ఓసి మొత్తం 16 పోస్టులు ఖాళీ ఉన్నాయని తెలిపారు. ఔత్సాహికులైన అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వండి

**-ప్రజావాణి లో 26 వార్డు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య వినతి**

**అర్హులకు ఇళ్ళు రాకపోతే కౌన్సిలర్ పదవికి రాజీనామా!?**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్ట్ 3 :** నిరుపేదల ఇళ్లల్లో కుటుంబ సభ్యులకు దురదృష్టవశాత్తు ఏదైనా జరగరానిది జరిగితే ఎక్కడ ఉండాలో తెలియని దిక్కు తోచని అయోమయ ఆందోళనకర స్థితిలోకి నెట్టి వేయబడు తున్నారని,ఆ కుటుంబాలకు హుజురాబాద్ లో డబుల్ బెడ్ రూమ్ గృహాలు అందజేసి చేయూత ఇవ్వాలని 26వ వార్డ్ కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య నరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె ఆర్డిఓకు,మున్సిపల్ కమిషనర్ బి కిషన్‌కు విజ్ఞాపన పత్రం అందజేశారు.మున్సిపల్ పరిధిలో అయిదారేళ్ళ క్రితమే డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించారని తమ వార్డులో సొంత నివాస గృహాలు లేని పేద ప్రజలకు గృహాలు కేటాయించాలని కేసిరెడ్డి లావణ్య కోరారు.తమ వార్డులో అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్న పలువురు అత్యంత నిరుపేదల, అర్హులైన పేర్లతో,వారి వివరాలతో ప్రజావాణిలో దరఖాస్తు అందచేశారు. తమ వార్డులో 45మంది గత ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకోగా అందులో 20 కుటుంబాలకు చెందిన వారు అద్దె ఇళ్లలో ఉంటూ దుర్భర జీవితం గడుపుతున్నారని ఆమె అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇందులో కొంతమంది అర్హులైన వారి పేర్లను తొలగించే ప్రయత్నం చేయడం తగదన్నారు. తాతలు ముత్తాతల కాలంలో ఉన్న భూములు, ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు ప్రస్తుతం ఉన్నట్లు నివేదిస్తున్నారని, కానీ ప్రస్తుతం వారికి భూములు గానీ సొంత ఇళ్లు కానీ లేవని, రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో దుర్భరమైన పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. అధికారులు ఈ అంశంలో సమగ్ర విచారణ చేసినా ఇది బహిర్గతమవుతుందన్నారు. 26 వార్డులో సభలు నిర్వహించడంతో పాటు అధికారులు స్వయంగా దరఖాస్తు దారులు ప్రస్తుతం నివాసం ఉన్న కిరాయి ఇళ్లలోని వచ్చి వారి కుటుంబ పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.వార్డులో సభ నిర్వహించి ప్రజల సమక్షంలోనే వారు అర్హులా?కాదా? నిర్ధారించాలని, నిజ మైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.తాము ప్రతి పాదించిన లబ్ధిదారులకు సొంత నివాసాలు గాని నివాస స్థలాలు గాని లేవని స్పష్టం చేశారు.నివాస గృహాలు ఉన్నవారి పేర్లు మునిసిపల్ కార్యాలయంలోనే రికార్డుల్లో ఉంటాయని,ఇంటి పన్ను,నల్లా బిల్లులు, విద్యుత్ కనెక్షన్లు పరిశీలించాలని కోరారు. లిస్టును స్థానిక సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి పంపితే వారు కూడా విచారణ చేసి వివరాల పంపిస్తారని తెలిపారు.తాను వార్డు ప్రజల అండదండలతో 4 సార్లు ఒకే వార్డు నుండి వార్డు సభ్యురాలిగా, కౌన్సిలర్గా గెలుపొందానని, నిజమైన అర్హులు ఇళ్లు కోల్పోవద్దని అన్నారు. తాము ఇచ్చిన వినతి పత్రంపై అధికారులు స్పందించక పోతే.. అర్హులకు ఇండ్లు రాకపోతే.. లబ్ధిదారుల ముందే కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమని ప్రకటించారు. రెవిన్యూ, మున్సిపల్ అధికారులు వార్డులో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తుపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ప్రణవ్ బాబు, మునిసిపల్ చైర్మన్ ఆర్ సుహాసినిలకు ఈ విషయమై వినతి పత్రం అందజేస్తున్నట్టు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య నరసింహారెడ్డి వెల్లడించారు.

# ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన ఎస్పీ



**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగష్టు, 03 :** సోమవారం నిర్మల్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ. జానకి షర్మిల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వయంగా స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు తెలిపిన సమస్యలను క్షుణ్ణంగా విన్న జిల్లా ఎస్పీ, వారి సమక్షంలోనే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రతి సమస్యను చట్టపరంగా పరిశీలించి బాధితులకు అందాల్సిన సహాయం, న్యాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో అధికారులు,సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,వారి వినతులు, ఫిర్యాదులను ఓపికగా విని స్వీకరించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటి కప్పుడు సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేయడంతో పాటు, ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు శాఖ దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు ప్రజలకు పోలీసు శాఖపై భరోసా, నమ్మకం మరింత పెరిగేలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందించడమే తమ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ. జానకి షర్మిల పేర్కొన్నారు

## డీపీఓగా శ్రీమాల బాధ్యతల స్వీకరణ



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 3 :** జిల్లా పంచాయతీ అధికారిగా(డీపీఓ) జిల్లా సహకార అధికారి శ్రీమాల పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. వీర బుచ్చయ్య పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో జెడ్పిసిఈఓ నరేందర్ కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం శ్రీమాలకు ఈ పదవి అప్పగించడం జరిగింది.ఈ సందర్భంగా సోమవారం జిల్లాలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి దేవకీదేవి, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు దేవరనేని నిషాంత్ రావు, శరత్ బాబు, కేవీ ప్రమోద్ కుమార్, ఎం. శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదాత మైలగాని కిరణ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**ఈసంపెల్లి కుమార్, మిత్ర బృందం ఆధ్వర్యంలో పోస్ట్ ఆఫీస్ ఖాతాలో రూ.60,000 జమ**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 3 :** నేత్రదాతగా సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన దివంగత మైలగాని కిరణ్ కుటుంబానికి రూ.60,000/- ఆర్థిక సహాయాన్ని ఈసంపెల్లి కుమార్ మరియు వారి మిత్ర బృందం అందజేశారు. మిత్రుల సహకారంతో సేకరించిన ఈ మొత్తాన్ని బాధిత కుటుంబం పేరుపై పోస్ట్ ఆఫీస్ ఖాతాలో జమ చేసి, పాస్‌బుక్‌ను కిరణ్ భార్య అనూష, అన్న కిషోర్‌తో పాటు కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ, మైలగాని కిరణ్ చేసిన నేత్రదానం సమాజానికి ఆదర్శప్రాయమని అన్నారు. వారి కుటుంబానికి అండగా నిలిచిన ఈసంపెల్లి కుమార్ మరియు వారి మిత్ర బృందం చేసిన ఈ సహాయం మానవత్వానికి నిదర్శనమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి, జిల్లా చైర్‌పర్సన్ మేకల మారుతి యాదవ్, కొట్టే స్వామి, కనిగంటి నాగరాజు, కొప్పుల రాము, మెట్టు అనిల్, మైలగాని కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా దుంపెన స్రవంతి నియామకం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 03 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన దుంపెన స్రవంతి బిజెపి మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు.జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ అక్కకు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రెడ్డబోయిన గోపి అన్నకు తన నియమాకానికి సహకరించిన బిజెపి నాయకులు అందరికీ దుంపెన స్రవంతి కృతజ్ఞతలు తెలిపారు.బిజెపి పార్టీ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని స్రవంతి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా కాస రాజు నియామకం



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఆగష్టు, 03 :** తెలంగాణ మెగా అభిమానుల మెగా యూత్ ఫోర్స్ జాయింట్ కన్వీనర్ గా కాసరాజును నియమిస్తున్నట్లు శ్రీ కొణిదెల సుస్మిత గారు హైదరాబాదులో కాసరాజుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షురాలు సుస్మిత మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా మెగా అభిమాన సంఘంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన కాస రాజుని గుర్తిస్తూ ఆయనకు ఈ పదవి ఇవ్వడం జరిగిందని రానున్న రోజుల్లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని తెలిపారు.ఇకనుండి మెగా హీరోల అభిమానులందరూ మెగా యూత్ ఫోర్స్ ద్వారానే కార్యక్రమాలను నిర్వహించాలని ఆమె పిలుపునిచ్చారు.అనంతరం కాస రాజు మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన మెగా హీరోలందరికీ కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రవణం స్వామినాయుడు, మెగా యూత్ ఫోర్స్ జాతీయ కన్వీనర్ ఏడిద బాబి రాష్ట్ర కార్యవర్గం పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిది

**-కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు**



**చురకలు ప్రతినిది ఎల్లారెడ్డిపేట ఆగస్టు 03 :** సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు అన్నారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారు సిలువేరు ఉత్తం పేరిట గల చెక్కును అతని తల్లి సరస్వతికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు సోమవారం పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామన్నారు.చెక్కు అందుకున్న సరస్వతి మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సీఎం రేవంత్ రెడ్డి అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ కు సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్రెడ్డి,ఎడ్ల కుమార్,గన్న శోభ,గంట బుచ్చా గౌడు,పారిపెల్లి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శివపరాశక్తి పీఠంలో శివయ్యకి విశేష అభిషేకాలు సప్త హారతులు

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 03 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని శివపరాశక్తి పీఠంలో సోమవారం సందర్భంగా శివయ్యకి పంచామృతాలు గంధం భాస్మభిషేకాలు సప్త హారతులు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగ జరిగింది.ఇట్టి విశేష పూజలకి భక్తులు వివిధ ప్రాంతాల నుండి వచ్చి శివయ్యకి భక్తి శ్రద్దలతో పూజలు చేసే మొక్కులు చెల్లించుకున్నారు.శివ పరాశక్తి పీఠాధిపతులు కాసు మనోహర్రాజు స్వామీజీ భక్తులకు తీర్థప్రసాదాలు అన్నప్రాసద వితరణ నిర్వహించారు.



# మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా : కలెక్టర్

**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగష్టు, 03 :** ఈరోజు నిర్మల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గంజాయి,ఇతర మాదకద్రవ్యాలు, గుడుంబా,గుట్కా తదితర నిషేధిత పదార్థాల అక్రమ రవాణా,నిల్వ, విక్రయం,వినియోగం నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా,ఎస్పీ. జానకి షర్మిల పాల్గొన్నారు.ఈ సందర్భం గా అధికారులు మాట్లాడుతూ గంజాయి ,ఇతర మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తుల ఆరోగ్యంతో పాటు యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపు తుందని తెలిపారు.ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని , గంజాయికి "నో" చెప్పి ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోవాలని



పిలుపునిచ్చారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు యువతపై ప్రత్యేకశ్రద్ధ వహించి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు.గంజాయి,గుడుంబా, గుట్కా తదితర నిషేధిత పదార్థాల అక్రమ రవాణా,తయారీ,నిల్వ, విక్రయాలను అరికట్టేందుకు పోలీస్, ఎక్సైజ్ తదితర సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాలు,గుడుంబా,గుట్కా తదితర నిషేధిత పదార్థాలకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలన కేవలం పోలీస్,ప్రభుత్వశాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. అన్ని శాఖల సమన్వయం, ప్రజల సహకారంతో "మాదకద్రవ్య రహిత నిర్మల్ జిల్లా"సాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,డీఆర్ఓ రాథోడ్ రమేష్,జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్,ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ప్రహరీ గోడను తొలగించండి

**-ప్రజావాణిలో ఇంచార్జీ కలెక్టర్‌కు కాలనీవాసుల ఫిర్యాదు**

**-న్యూ బస్టాండ్ సమీపంలో రోడ్డు ఆక్రమణ**

**-ప్రజావాణిలో ఇంచార్జీ జిల్లా కలెక్టర్‌కు వినతి**

**చురకలు ప్రతినిధి,హనుమకొండ ఆగస్టు 03 :** హనుమకొండ లక్ష్మీపురం



న్యూ బస్టాండ్ సమీపంలోని కాలనీలో రోడ్డును ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఇన్చార్జ్ కలెక్టర్ ఎన్. రవికి ఈ మేరకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. కాలనీలోని తన ఇంటిస్థలానికి ఆనుకుని ఉన్న ప్రజా రహదారిపై రాజబాబు,గందె కృష్ణ అనే వ్యక్తులు అక్రమంగా ప్రహరీ గోడను నిర్మించి దారి లేకుండా చేశారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆక్రమణలను తొలగించి, రోడ్డును కాలనీవాసులందరికీ అందుబాటులోకి తీసుకురావాలని విన్నవించారు.ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించిన ఇంచార్జీ కలెక్టర్ ఎన్. రవి..ఈ సమస్యను వెంటనే పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు నవీన్, శీను,సతీష్, చిదరాల శ్రీను,సారంగపాణి పాల్గొన్నారు.

# గుంతలు పడిన రోడ్డును పూడ్చివేయిస్తున్న సర్పంచ్

**-సొంత ఖర్చులతో సర్పంచ్ మాదాసు స్రవంతి బాబు ఔదర్యం**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 03 :** ప్రభుత్వ నిధులతో బాగు చేయించవలసిన గుంతలుపడి అధ్వానంగా మారిన రోడ్డును ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామసర్పంచ్ మాదాసు స్రవంతిబాబు ఏకంగా సొంత ఖర్చులతో గుంతలు పూడ్చి వేయించి ఆదర్శంగా నిలిచారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుండి గర్జనపల్లి మరిమడ్ల వరకు డబల్ రోడ్డు నిర్మించిన ఏ వన్ కాంట్రాక్టర్ దుమాలరాపెల్లి వాగుపై బ్రిడ్జి నిర్మాణం పనులను సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించారు.సబ్ కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణం పనులను ఎట్టకేలకు పూర్తి చేసినప్పటికీ బ్రిడ్జికి ఇరువైపులా 100 మీటర్ల పొడవు మట్టి రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారి ఈబిడ్జి గుండా మండల కేంద్రం నుండి దుమాల అక్కపల్లి వీర్నపల్లి కొనరావు పేట మండలాలకు వెళ్లే



ప్రయాణికులు వివిధ వాహనదారులు సర్కస్ ఫైట్స్ చేస్తూ ఇబ్బందుల పాలయ్యారు, గర్భవతులు వృద్ధులు నరకాన్ని అనుభవించారు.ఓరి దేవుడా,,,,ఈ ప్రాంతంలో తాము పుట్టడమే పాపమా,,,,,ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకుపోగా అక్కపల్లి గ్రామ సర్పంచ్ మాదాసు స్రవంతి బాబు ముందుకు వచ్చి తమ సొంత ఖర్చులతో గుంతలు పడి అధ్వన్నంగా మారిన రోడ్డును ఫ్రంట్ బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో పూడ్చి వేయించి తన ఔదార్యాన్ని చాటుకుంది. బ్రిడ్జికి రెండువైపులా గుంతలు పడ్డ రోడ్డును మట్టితో పూడ్చివేయించారు.గత ఏడాది కూడా ఇదే విధంగా తన సొంత ఖర్చులతో పూడ్చి వేయించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూడిది రాజేందర్, మాజీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాడి రామ్ రెడ్డి,జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్ రెడ్డి, అక్కపల్లి మాజీ సర్పంచ్ మందాటి దేవేందర్ యాదవ్,జిల్లా నాయకులు ఎస్కే గౌస్,సాహెబ్ బండారి బాల్ రెడ్డి, జంకె లచ్చిరెడ్డి గంట బుచ్చాగౌడు, జంకె జనార్దన్ రెడ్డి షకీల్ సిరిసిల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# కొండగట్టు అంజన్న మహిమతోనే వర్షాలు కురిశాయి

**చురకలు విలేకరి, మల్యాల, ఆగస్టు 3 :** చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కొండగట్టు మహా గిరి ప్రదక్షిణ అనంతరం వరుణదేవుడు కరుణించి వర్షాలు కురవడంతో రైతుల్లో ఆనందం నెలకొందని మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మల్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎలినినో ప్రభావం, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు. ఈ నేపథ్యంలో కొండగట్టు ఆంజనేయస్వామిపై వి



శ్వాసంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం 20 రోజుల ముందుగానేమహా గిరి ప్రదక్షిణ నిర్వహిస్తానని ప్రకటించారని తెలిపారు. పౌర్ణమి రోజునమంత్రిపొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అట్లూరి లక్ష్మణ్ కుమార్, రైతులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి గిరి ప్రదక్షిణ నిర్వహించిన అనంతరం రాష్ట్రంలో వర్షాలు కురవడం ఆంజనేయ స్వామి అనుగ్రహమేనని అభిప్రాయ పడ్డారు. రైతులు సంతోషంగా ఉన్న సమయంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తదితరులు వర్షాలు, నీటి విడుదలపై చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎల్లంపల్లి, కడెం ప్రాజెక్టులు, ఎస్సారెస్పీ వరద కాలువల ద్వారానే గత రెండేళ్లుగా రైతులకు సాగునీరు అందుతోందని, ప్రస్తుతం కూడా అదే వ్యవస్థ ద్వారా నీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రైతుల పట్ల చూపు తున్న నిబద్ధతపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని బత్తిని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

# జిల్లా కలెక్టర్, డిపివో,ఎంపివోలపై చర్యలు తీసుకోండి

**-బుగ్గారం జి.పి. కేసును సిఐడి లేదా విజిలెన్స్ అధికారులకు అప్పగించండి**
**-అధికారుల అవినీతిపై ఎసిబి విచారణ జరిపించండి**
**-కార్యదర్శి మహబూబ్ పాషా రోడ్డు ప్రమాద మరణం అనుమానస్పదమే...?**
**-లోకాయుక్త కు ఫిర్యాదు చేసిన చుక్క గంగారెడ్డి**

**చురకలు విలేకరి,జగిత్యాల, ఆగస్టు 3 :** లోకాయుక్త న్యాయస్థాన తీర్పును ధిక్కరించి,చట్టాలను ఉల్లంఘించి, తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ ఆర్డర్ లను కూడా బేఖాతర్ చేసి అత్యంత విలువైన వారి విధులను, బాధ్యతలను నిర్లక్ష్యం చేసి వారి అధికారాన్ని కూడా దుర్వినియోగం చేసిన జగిత్యాల జిల్లా కలెక్టర్ తో సహా జిల్లా పంచాయతీ అధికారి చీకోటి మదన్ మోహన్,బుగ్గారం పూర్వ ఎంపివో షేక్ అఫ్జల్ మియా లతో పాటు బాధ్యులైన ఇతర అధికారులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకో వాలని సోమవారం హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర లోకాయుక్తకు చుక్క గంగారెడ్డి పిర్యాదు చేశారు.భారీగా నిధులు దుర్వినియోగం అయిన బుగ్గారం గ్రామ పంచాయతీ కేసును సిఐడి లేదా విజిలెన్స్ లేదా ఎసిబి అధికారులకు అప్పగించి ముందస్తు క్రిమినల్ కేసులు నమోదు చేయించా లని ఆయన లోకాయుక్తకు విజ్ఞప్తి చేశారు.తప్పుడు విచారణ నివేదికలు అందజేసిన జగిత్యాల, మెట్పల్లి పూర్వ డివిజనల్ పంచాయతీ అధికారులు కనకదుర్గ, శ్రీనివాస్ లపై, అలాగే... చెయ్యని అభివృద్ధి పనులకు దొంగ ఎంబి రికార్డులు సృష్టించిన ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ వివేక్ మీద, నిధుల దుర్వినియోగంలో పాలు పంచుకున్న పూర్వ ఎంపివో షేక్ అఫ్జల్ మియా లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన లోకాయుక్త ను కోరారు. బుగ్గారం గ్రామ పంచాయతీ లో భారీగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ తాజా మాజీ సర్పంచ్ మూల సుమలత, ఆమె భర్త మూల శ్రీనివాస్‌గౌడ్,ఈ- పంచా యతీ ఆపరేటర్ జీతం పేరుతో ఎంపివో ఖాతాలోకి నిధులు మళ్లించు కున్న పూర్వ ఎంపివో షేక్అఫ్జల్ మియా, అప్పటి జూనియర్ పంచాయతీ కార్య దర్శి ఎస్.నరేందర్‌లతో పాటు బాధ్యు లైన ఇతరులందరిపై,నిధుల దుర్విని యోగానికి సహకరించిన అధికారులపై లోకాయుక్త జారీ చేసిన గత జడ్జిమెంట్ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని చుక్క గంగారెడ్డి సోమవారం లోకాయుక్తను కోరారు.

**ఎటూ తేల్చకుండా...**

గత ఆరేండ్లుగా బుగ్గారం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం సమస్యను సాగదీస్తున్న అధికారులు భారీగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై ఎసిబి అధికారులతో విచారణ జరిపించి తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన లోకాయుక్త కు ఇచ్చిన పిర్యాదు లో పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారులు వ్యవహరిస్తున్న శైలి, జి.పి. నిధుల దుర్వినియోగం కేసు సాగదీత తీరును చూస్తే... పూర్వ పంచాయతీ కార్యదర్శి మహబూబ్ పాషా రోడ్డు ప్రమాదంలో మరణించిన ఘటన కూడా అనుమానాస్పదంగానే ఉందని దీనిపై కూడా విచారణ జరిపిస్తే బాగుంటుందని చుక్క గంగారెడ్డి సోమవారం లోకాయుక్త కు ఇచ్చిన పిర్యాదులో సూచించారు. లోకాయుక్త న్యాయస్థానానికి జగిత్యాల జిల్లా కలెక్టర్ పంపిన నివేదిక పై చుక్క గంగారెడ్డి సోమవారం తన అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా లోకాయుక్త కు అందజేశారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 38 ఫిర్యాదులు స్వీకరణ**
**-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 03 :** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిం చడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 38 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల



సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ .....ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదు దారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



## అదనపు తరగతి గది మంజూరు చేయాలని కలెక్టర్‌కు సర్పంచ్ వినతి



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 03 :** ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదనపు తరగతి గదిని మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ మామిండ్ల కిషన్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలోఆయన కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.గతంలో కూడా 2026 జూలై 13న నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇదే సమస్యపై జిల్లా కలెక్టర్‌కు సర్పంచ్ మామిండ్ల కిషన్ వినతిపత్రం అందజేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు అదనపు తరగతి గది మంజూరు కాకపోవడంతో, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరోసారి ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.అగ్రహారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకున్నందున ఒక తరగతి గదిని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇటీవల తొలగించారు. దీంతో ప్రస్తుతం పాఠశాలలో ఒకే ఒక్క తరగతి గది మాత్రమే మిగిలి ఉండగా, అదే గదిలో 34 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.యూకేజీ నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు ఒకే గదిలో ముగ్గురు ఉపాధ్యాయులు బోధనలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. తరగతుల నిర్వహణకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పాటు విద్యార్థుల అభ్యాసంపై ప్రతికూల ప్రభావం పడుతోందని సర్పంచ్ వినతిపత్రంలో వివరించారు.విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా వెంటనే అదనపు తరగతి గదిని మంజూరు చేసి, నిర్మాణానికి అవసరమైన పరిపాలనా అనుమతులు ఇవ్వాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ మామిండ్ల కిషన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అగ్రహారం పాఠశాలలో నెలకొన్న గదుల కొరతను అత్యవసరంగా పరిష్కరించి, అదనపు తరగతి గది నిర్మాణానికి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, అదనపు తరగతి గది నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**చురకలు విలేకరి, కొడిమ్యాల, ఆగస్టు 3 :** కొడిమ్యాల మండలంలోని తిప్పాయిపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు గట్ల రాజిరెడ్డి తండ్రి గట్ల తిరుపతిరెడ్డి ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబాన్ని సోమవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ లాగల రాజేశం,బాసం పరశురాములు,దుబ్బాక శ్రీనివాస్ తదితరులున్నారు.

## ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అధ్యక్షునిగా కృష్ణారెడ్డి



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్,పెద్దపల్లి జిల్లా ఆగస్టు 3 :** పెద్దపల్లి సర్కిల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా సీనియర్ కాంట్రాక్టర్ ఏ కృష్ణారెడ్డి, ఎన్నుకున్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఎన్నికలను నిర్వహించుకున్నారు.ఉపాధ్యక్షునిగా చెప్పాల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం సుధాకర్, కోశాధికారిగా ఎన్ రాజిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా వి శ్రీనివాస్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా జిరాధయ్య, పిల్లి రాజు,ఎస్ గురువయ్య,గుమ్మడి అంజయ్య,డి స్రవంతి,ఎం శంకర్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు ఏ ఆపద వచ్చిన అందుబాటులో ఉండి వారికి న్యాయం చేస్తానని అన్నారు. నాపై నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు గాను సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎన్నికైన సభ్యులను పూలదండలతో శాలువతో ఘనంగా సన్మానించారు.

# కాళేశ్వరం ప్రాజెక్ట్ తరతరాలకు చెరగని చిరునామా

**-కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్**

చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, ఆగస్టు 3: తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీరు అందించాలనే మహత్తర లక్ష్యంతో కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ తరతరాలకు చెరగని చిరునామా అంటూ కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం మండలంలోని రాజేశ్వరరావు పేట పంపు హౌస్ ను బిఆర్ఎస్ నాయకలతో కలిసి సందర్శించారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసినా అనంతరం ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ రైతుల కోసం బీడుగా ఉన్న వేలాది ఎకరాల భూములు



సాగుకు అనుకూలంగా దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ఫలితంగానే నేడు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రాజేశ్వరరావు పేట పంప్ హౌస్ ద్వారా జగిత్యాల,కోరుట్ల,మెట్పల్లి ప్రాంతాలతో పాటు వరద కాలువ ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం కలుగు తుందని, భూగర్భ జలాలు పెరిగి రైతులకు, గ్రామీణ ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వరద కాలువలోకి గోదావరి జలాలు చేరుతు న్నాయని కొనియాడారు. గత రెండు రోజులుగా ఎల్లంపల్లి నుంచి రాజేశ్వర రావుపేట పంప్ హౌస్ ద్వారా సుమారు అర టీఎంసీ నీటిని వరద కాలువలోకి విడుదల చేసినట్లు పేర్కొన్నారు.ఈ నీటితో ఇప్పటివరకు బీడుగా ఉన్న వేలాది ఎకరాల భూము లు సాగుకు అనుకూలంగా మారి సస్యశ్యామలంగా మారనున్నాయని, ఒకప్పుడు గోదావరి జలాలు సముద్రంలో కలిసిపోతుండగా నీటిని వృధా కాకుండా సద్వినియోగం చేసేందుకు ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త దిశ చూపిన ఘనత కేసీఆర్కే దక్కుతుందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు తెలంగాణ వ్యవసాయ రంగాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిస్తున్నయని తెలిపారు. నిలిపాయని, కాళేశ్వరం వంటి మహత్తర ప్రాజెక్టుల ఫలితాలు రానున్న తరాలకు కూడా ఉపయోగపడతాయని ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ గారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు

**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 3 :** బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 26 మంది ఆర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని



సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## సింగసముద్రం కాలువ మరమ్మత్తులకు

# ఈఈకు సర్పంచ్ వినతి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 03 :** ఎల్లారెడ్డిపేట, బొప్పాపూర్, నారాయణపూర్ గ్రామాల రైతులకు వరప్రదాయినిగా ఉన్న సింగసముద్రం కాలువకు తక్షణ మరమ్మత్తులు చేపట్టాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎనగందుల నరసింహులు జిల్లా ఇరిగేషన్ ఈఈ దయాకర్‌కు వినతిపత్రం అందజేశారు.జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట అగయ్య ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా కలెక్టరేట్ సముదాయంలోని ఇరిగేషన్ కార్యాలయంలో ఈ వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సింగసముద్రం తూము వద్ద, బొప్పాపూర్ గంగమ్మ గుడి సమీపంలో కాలువకు గండులు ఏర్పడి నీటి పారుదల దెబ్బతింటోందని తెలిపారు. వెంటనే మరమ్మత్తులు చేపట్టి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఇరిగేషన్ ఈఈ దయాకర్ సమస్యను పరిశీలించి సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు. రైతులకు నీరు సక్రమంగా అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# కూడళ్లలో షీ టీం నిత్యం నిఘా

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 3 :** ప్రధాన కూడళ్లలో షీ టీం నిత్యం నిఘా ఉంటుంది అని షీ టీం సభ్యురాలు స్నేహలత అన్నారు. సోమవారం రామగుండం సి.పి ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జ్ ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో



పెద్దపెల్లి షీ టీమ్ వారు, జడ్పీహెచ్ఎస్ హై స్కూల్, రామగుండము లో జరిగే పి ఈ టి ఉపాధ్యాయుల ట్రైనింగ్ లొ షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది అందులో భాగంగా షీ టీమ్ మెంబర్ స్నేహలత మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ఎలా ఉండాలి, పోక్సో యాక్ట్ గురించి, సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది, విద్యార్థుల ప్రవర్తన నియామవాలి గురించి తెలిపారు మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ గురించి తెలిపారు ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిఘా ఉంటుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు , అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని, అలాగే అన్లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలనీ, మహిళలకు ప్రయాణ సమయం లొ ట్రావెలింగ్ సేఫ్టీ అప్ టి సేఫ్ ఆప్ వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమం లొ ఉపాధ్యాయులు మరియు షీ టీమ్ సభ్యులు, సురేష్, మౌనిక పాల్గొన్నారు.

# మూత్ర విసర్జనకు వెళ్లి మృత్యులోకాలు



**-నీట మునిగి ఇద్దరు విద్యార్థుల దుర్మరణం**

**-మల్యాల ఐడబ్ల్యూహెచ్సి హాస్టల్లో విషాదం**

**చురకలు విలేకరి, మల్యాల, ఆగస్టు 3 :** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ హాస్టల్ బాలుర వసతి గృహంలో ఉంటున్న ఇద్దరు విద్యార్థులు ప్రమాదవ శాత్తు నీటి కుంటలో మునిగి మృతి చెందారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లిన 4వ తరగతి విద్యార్థి జగన్నాథ్ సుశాంత్ కృష్ణ (టీఆర్ నగర్), 5వ తరగతి విద్యార్థి వనం విష్ణు రాములు (మోర్తాడ్) కాలు జారి నీటి కుంటలో పడి మునిగిపోయారు. సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇద్దరి మృతదేహాలను నీటి నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో హాస్టల్ విద్యార్థులు, ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఫోన్లో మాట్లాడి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

# తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా



**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 3 :** ప్రపంచ తల్లిపాలు వారోత్స వాలను పురస్కరించుకుని ఆగస్టు 1 నుండి 7వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, సోమవారం జగిత్యాల మున్సిపల్సెక్టర్ పరిధిలోని 26వ వార్డు, అంగన్వాడీ సెంటర్ తల్లిపాలు వారోత్సవాలను కౌన్సిలర్ పులి రమ ప్రారంభించగా జగిత్యాల సీడిపిఓ జయప్రద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ జయప్రద మాట్లాడుతూ, ఏడు నెలలు నిండిన పిల్లలకు అనుబంధ ఆహారాన్ని ప్రారంభించడానికి ఇదే సరైన సమయమన్నారు. ఆహారంతో పాటు 2 సంవత్సరాల వరకు స్తన్య పానం కొనసాగించాలని సూచించారు. తల్లి పాలకు ప్రత్యామ్నాయం లేదని, మొదటి 6 నెలలు బిడ్డకు తల్లిపాలు తప్ప మరేమీ ఇవ్వొద్దన్నారు. తల్లిపాలు బిడ్డకు మొదటి టీకాలా పని చేస్తుందన్నారు. తల్లిపాల వల్ల తల్లి ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని, బ్రెస్ట్ క్యాన్సర్, అలర్జీలు వచ్చే అవకాశాలు తగ్గుతాయని జయప్రద వివరించారు. పాలు ఇచ్చిన వెంటనే బిడ్డకు తేన్పు రావాలని సూచించారు. 7 నెలల పిల్లలకు ఇంట్లోనే శుభ్రంగా తయారుచేసిన ఆహారం ఇవ్వాలని, అందులో పప్పు, మినప్పు, సిరిధాన్యాల మిశ్రమ పిండిని ఉపయోగించాలని సూచించారు. ప్రతి గర్భిణి, బాలింత ఈ విషయాలపై అవగాహన కలిగి ఉండాలని కౌన్సిలర్ పులి రమ కోరారు. ఈ కార్యక్రమంలో మమత,కవి త,అంగన్వాడీ టీచర్లు దయావతి, యాతిశ్వరి, సౌజన్య, ఏఎన్ఎం మాదేషి శిరీష, ఆశా వర్కర్లు లావణ్య, స్వరూప, తల్లులు, పిల్లలు, బాలింతలు పాల్గొన్నారు.